సాక్షి
కాకినాడ

బుధవారం । 18 । డిసెంబర్ । 2024



దోపిడీ దొంగల బీభత్సం

నల్లజర్ల మండలం దూబచర్లలో దోపిడీ దొంగలు ఒక ఇంట్లోకి చొరబడి 24 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు దోచుకుపోయారు.


8 లో



పందెం పుంజా... మజాకా!

సంక్రాంతి పండగ సమీపిస్తుండడంతో కోడి పుంజుల వేటలో పందెం రాయుళ్లు ఉంటే.. నిర్వాహకులు మూడు నెలల నుంచి పుంజుల పెంపకంలో నిమగ్నమయ్యారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 12,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.70 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

జేఎన్‌టీయూకేలో అంతర్గత బదిలీలు



బదిలీ అయిన అధికారులతో ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకేలో పలువురు అధికారులను అంతర్గతంగా బదిలీ చేశారు. ఇన్‌చార్జ్ ఉప కులపతి ఆచార్య మురళీకృష్ణ ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఐఎస్‌టీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.రామును అడ్మిషన్స్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. అడ్మిషన్స్ డైరెక్టర్‌గా ఉన్న ఏఎం ప్రసాద్‌ను ఐఎస్‌టీ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా నియమించారు. స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి మాలోతు రమేష్‌ను ఫుడ్ టెక్నాలజీ డైరెక్టర్‌గా, ఫార్మాస్యూటికల్ ప్రత్యేకాధికారి కె.పద్మప్రియను స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నియమించారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి కోటేశ్వరరావును బీటెక్ అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ బోర్డు చైర్మన్‌గా బదిలీ చేశారు. ఐఐఐపీటీ డైరెక్టర్, ఈసీఈ ప్రొఫెసర్ బత్తుల కృష్ణను ఎంటెక్ వీఎల్ఎస్ఐ ప్రోగ్రాం బోర్డు స్టడీస్ చైర్మన్‌గా నియమించారు. బదిలీ అయిన వారికి ఇన్‌చార్జ్ వీసీ మురళీకృష్ణ తన చాంబర్‌లో మంగళవారం నియామక ఉత్తర్వులు అందజేశారు.

రేపు ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విజయవాడలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకూ జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును గురువారం ఎంపిక చేయనున్నారు. జిల్లా ఫెన్సింగ్ సంఘం అధ్యక్షుడు సింహాద్రి పవన్ వికాస్ మంగళవారం ఈ విషయం తెలిపారు. కాకినాడ గాంధీనగర్‌లోని ఫెన్సింగ్ క్లబ్ ఆవరణలో ఈ ఎంపికలు జరుగుతాయన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రాతిపదికన జరిగే ఈ ఎంపికలకు ఆసక్తి ఉన్న వారు హాజరు కావాలని, వివరాలకు 93917 38554 నంబరులో సంప్రదించాలని కోరారు.

98 వేల టన్నుల ధాన్యం కొనుగోలు

కాకినాడ సిటీ: రైతుల నుంచి ఖరీఫ్‌లో 4.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఈ నెల 4 నుంచి ఇప్పటి వరకూ 98,078 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 277 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 16,235 మంది రైతుల నుంచి రూ.225.46 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఇప్పటి వరకూ రూ.221.07 కోట్లు చెల్లించామని తెలిపారు. రైతుల హమాలీ ఖర్చులకు రూ.1.68 కోట్లు, గోనె సంచుల యూజర్ చార్జీలకు రూ.28 లక్షలు చెల్లించామన్నారు.

23న సబ్ జూనియర్ ఆర్చరీ పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఈ నెల 23 నుంచి 25 వరకూ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల ఆర్చరీ పోటీలు స్థానిక ఫ్యూచర్ కిడ్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్నారు. జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావు మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్చరీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచీ కోచ్‌లు, క్రీడాకారులు 550 మంది హాజరవుతారని వివరించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జైపూర్‌లో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు 'నన్నయ' విద్యార్థి ఎంపిక

రాజానగరం: దేశ రాజధాని ఢిల్లీలో వచ్చే నెల 26న జరిగే గణతంత్ర వేడుకల పరేడ్‌కు ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థి ఎస్.వెంకట రమణ ఎంపికయ్యాడు. అతడు యూనివర్సిటీ క్యాంపస్‌లోని కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఎంపీఈడీ ఫైనలియర్ చదువుతున్నాడు. పుణేలో జరిగిన ప్రీఆర్‌డీలో అత్యుత్తమ ప్రతిభ చూపడం ద్వారా ఢిల్లీ పరేడ్‌కు ఎంపికయ్యాడని ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపిక కాగా వారిలో వెంకట రమణ కూడా ఉండటంపై హర్షం వ్యక్తం చేశారు. ఆ విద్యార్థిని వీసీ ఆచార్య శ్రీనివాసరావు మంగళవారం అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, పీడీ ఎం.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

రత్నగిరి.. సమస్యలే మరి!

- అస్తవ్యస్తంగా అన్నవరం దేవస్థానం ఆర్థిక పరిస్థితి
- ప్రదక్షిణ దర్శనం నిలిపివేత
- నిరుపయోగంగా నివేదన శాల
- విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి దాత ముందుకు వచ్చినా మోకాలడ్డు
- కొత్త ఈఓ దృష్టి సారించాలంటున్న భక్తులు



అన్నవరం దేవస్థానం

అన్నవరం: నూతన కార్యనిర్వహణాధికారి (ఈఓ) వీర్ల సుబ్బారావుకు అన్నవరం దేవస్థానంలో అనేక సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. గత శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించిన ఆయన.. అప్పటి నుంచీ దేవస్థానంలోని వివిధ విభాగాలను పరిశీలించి, సిబ్బంది పని తీరుపై వాకబు చేస్తున్నారు. మూడు రోజులుగా ఆయన ఉదయం 5 గంటలకే వ్రత విభాగం, ఆలయం, గోకులం, ఇతర విభాగాలను పరిశీలిస్తున్నారు. కొత్త ఈఓ దృష్టి పెట్టాల్సిన పనులు దేవస్థానంలో చాలానే కనిపిస్తున్నాయి.

ఆర్థిక ఇబ్బందులు

దేవస్థానం ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. ప్రతి నెలా జీతభత్యాలకు రూ.6 కోట్లు, పెన్షన్లు, ఇతర చెల్లింపులకు మరో రూ.2 కోట్లు అవసరం. ఇంకా దినుసుల కొనుగోళ్లు, విద్యుత్ చార్జీల చెల్లింపునకు మరో రూ.3 కోట్లు కావాలి. ప్రస్తుతం దేవస్థానం వద్ద నగదు నిల్వలు రూ.2 కోట్లు కూడా లేవు. కార్తిక మాసంలో రూ.21 కోట్లు వచ్చినా వెంటనే వివిధ బిల్లులు చెల్లించేశారు. దీనికి తోడు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఇంజినీరింగ్ విభాగానికి రూ.10 కోట్లు కేటాయించగా నవంబర్ నెలాఖరుకే సుమారు రూ.9.25 కోట్లు చెల్లించేశారు. ఇంకా రూ.2 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీని కోసం సప్లిమెంటరీ బడ్జెట్ పెట్టాలని అధికారులు భావిస్తున్నారు.

ప్రదక్షిణ దర్శనానికి స్వస్తి

గతంలో దాతల సహకారంతో చేపట్టిన పలు కార్యక్రమాలకు క్రమంగా స్వస్తి చెప్పారు. అప్పటి ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ 2023 దసరాల్లో సత్యదేవుని ప్రధానాలయంలో నాలుగు మూలలా శ్రీగంధం, (గంధం గిన్నె), లక్ష్మీ హుండీ, కామధేనువు, కల్పవృక్షం ఏర్పాటు చేసి, భక్తులు స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసే విధానం ప్రవేశపెట్టారు. ఈ నాలుగింటినీ సప్తగిరి హేచరీస్ అధినేత పెదబాబు రూ.30 లక్షలతో తయారు చేయించి, దేవస్థానానికి అందజేశారు. ప్రదక్షిణ దర్శనానికి రూ.300 టికెట్టు పెట్టారు. శ్రీగంధం గిన్నె, లక్ష్మీ హుండీ, కామధేనువు, కల్పవృక్షానికి నమస్కరిస్తూ సత్యదేవునికి ప్రదక్షిణ చేయడంతో భక్తులు సంతృప్తి చెందేవారు. ఈ ప్రదక్షిణ దర్శనం టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి ప్రతి రోజూ రూ.2 లక్షలు పైగా ఆదాయం వచ్చేది. ఆజాద్ తరువాత ఈఓగా వచ్చిన కె.రామచంద్ర మోహన్ ఈ ప్రదక్షిణ దర్శనాన్ని నిలిపివేశారు. ఆ నాలుగు వస్తువులను ఆలయంలో ఒక మూలకు చేర్చారు. దీంతో దాత తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.

నిరుపయోగంగా కొత్త నివేదన శాల

తుని పట్టణానికి చెందిన దాత చెక్కా తాతబాబు రూ.20 లక్షలతో రామాలయం ఎదురుగా సర్క్యులర్ మండపంపై 2023లో స్వామివారి నివేదన శాల నిర్మించారు. దానిలో కొద్ది రోజులు మాత్రమే నివేదన తయారు చేశారు. తరువాత క్యూ కాంపెక్స్ వద్ద ఉన్న పాత నివేదన శాలకు మళ్లీ మార్చారు. ప్రస్తుతం కొత్త నివేదన శాల నిరుపయోగంగా ఉంది. దీనిపై దానిని నిర్మించిన దాత అసంతృప్తి వ్యక్తం చేశారు.

జ్యోతిర్మయి వ్రతానికి మంగళం

ఆజాద్ ఈఓగా ఉన్నప్పుడు 2023లో జ్యోతిర్మయి వ్రత నిర్వహణకు రామాలయం సమీపాన ఉన్న పాత భవనానికి రూ.30 లక్షలతో మరమ్మతులు చేశారు. ఏసీలు అమర్చారు. వ్రత నిర్వహణకు దేవదాయ శాఖ కమిషనర్ అనుమతి కూడా ఇచ్చారు. కానీ, దానిని తరువాత ఈఓగా వచ్చిన రామచంద్ర మోహన్ నిలిపివేశారు. ప్రదక్షిణ దర్శనం, కొత్త నివేదన శాల వినియోగం, జ్యోతిర్మయి వ్రతం నిర్వహణపై దేవస్థానం వైదిక కమిటీ ఒక ఈఓ హయంలో అవునని, మరో ఈఓ హయాంలో కాదని చెప్పడం కూడా వివాదాస్పదమవుతోంది.

దాతను కాదని.. సొంత సొమ్ముతో..

పశ్చిమ రాజగోపురం వద్ద రూ.2 కోట్లతో విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి 2023లో విశాఖకు చెందిన లారెల్స్ ఫార్మా కంపెనీ ముందుకు వచ్చింది. ఆ మేరకు నాటి ఈఓ ఆజాద్ ఆదేశాలు కూడా ఇచ్చారు. తరువాత ఏమైందో ఆ విశ్రాంతి షెడ్డు నిర్మాణం ఆగి పోయింది. ప్రస్తుతం దేవస్థానం నిధులు రూ.90 లక్షలతో నూతన విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. మరోసారి ఆ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడితే వారే ఈ షెడ్డు నిర్మించే అవకాశముంటుంది.

గైడ్ల దందా

పశ్చిమ రాజగోపురం వద్ద గైడ్‌లుగా చెప్పుకుంటున్న అనధికార వ్యక్తులు భక్తులకు సులభంగా దర్శనం చేయిస్తామంటూ దందా చేస్తున్నారు. వీరికి దేవస్థానంలోని కొంతమంది ఉద్యోగులు, హోం గార్డులు, సెక్యూరిటీ సిబ్బంది సహకరిస్తున్నారనే విమర్శ ఉంది. వీరు భక్తులను ప్రత్యేక దర్శనం టికెట్లు కొనకుండా, ఆ డబ్బులు తమకిస్తే తామే దర్శనం చేయిస్తామని చెప్పి, దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్నారు.

ఆహార పదార్థాల తనిఖీ అవసరం

సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో భోజనం, ఇతర ఆహార పదార్థాలు రుచిగా ఉండటం లేదనే అభిప్రాయం ఉంది. టెండర్ ద్వారా కొనుగోలు చేస్తున్న బియ్యంలో కల్తీయో లేక స్టీమ్ మీద తయారవడం వల్లనో కానీ ఆ అన్నం చల్లారితేనే కానీ తినడానికి బాగుండటం లేదని పలువురు భక్తులు అంటున్నారు. అలాగే, కూరలు, సాంబారు కూడా. ప్రతి రోజూ వీటిని తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది. మరోవైపు ఆలయం వద్ద భక్తులకు పంపిణీ చేస్తున్న పులిహోరపై కూడా అప్పుడప్పుడు ఇదే విధమైన విమర్శలు వస్తున్నాయి. వీటిపై కూడా దృష్టి పెట్టాలి. సత్రాల్లో వసతులపై కూడా తనిఖీలు చేసి, ఎప్పటికప్పుడు భక్తుల అభిప్రాయాలు తెలుసుకుని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చక్కదిద్దుతా..



భక్తులకు ఉత్తమ సేవలందించేందుకు తగు చర్యలు తీసుకుంటాను. ప్రతి రోజూ అన్ని విభాగాలనూ తనిఖీ చేసి, వాటిపై అవగాహన తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాను. త్వరలోనే ఆయా విభాగాల అధికారులతో సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకుంటాను. అన్నీ చక్కదిద్దగలననే విశ్వాసం ఉంది.

– వీర్ల సుబ్బారావు, నూతన ఈఓ, అన్నవరం దేవస్థానం



గంధపు గిన్నె | లక్ష్మీ హుండీ | కల్పవృక్షం | కామధేనువు

ఎస్టీలకు అండగా ఉంటాం

- వారి సమస్యల పరిష్కారమే లక్ష్యం
- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్రంలో ఎస్టీలకు అండగా నిలిచి, వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యుడు వదిత్యా శంకర్ నాయక్ అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) ప్రజల నుంచి స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎస్టీలకు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. చాగల్లు మండలం మీనానగరం, తాళ్లపూడి మండలం తుపాకుల గూడెం తదితర ప్రాంతాల్లో అధికారులు వ్యక్తిగతంగా పర్యటించి, ఆయా కుటుంబాలు ఎన్ని ఉన్నాయి, జనాభా, ప్రభుత్వ పరంగా పొందుతున్న పథకాల వివరాలు సేకరించాలని కోరారు. ఆధార్ లేక కొన్ని ఎస్టీ కుటుంబాల్లో బడికి వెళ్లే పిల్లలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని చెప్పారు. చెంచు తెగకు చెందిన 16 కుటుంబాలు చాగల్లు మండలం మీనానగరంలో తరతరాలుగా నివసిస్తున్నామని, చెరువులపై తమకు అవకాశం ఇవ్వాలని ఆ గ్రామానికి చెందిన చెందిన ఆవాల కోటయ్య కోరారు. దీనిపై సర్వే చేసి, అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని శంకర్ నాయక్ చెప్పారు. తాళ్లపూడి మండలం తుపాకులగూడెంలో సాగు చేసుకుంటున్న భూములపై, గ్రామంలోని చెరువుల్లో చేపలు పెంచేందుకు హక్కులు కల్పించాలని, ఆధార్ కార్డు లేక, కొన్ని కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు దక్కడం లేదని మరో అర్జీ వచ్చింది. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎన్ జ్యోతి, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ తదితరులు

జనసేనకు జెల్ల

25 డీసీలకు మూడు మాత్రమే ఆ పార్టీకి..

సాక్షి, అమలాపురం: సాగునీటి సంఘాల ఎన్నికలలో కీలకమైన డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) ఎన్నికలలో జనసేన పార్టీకి మిత్రపక్షమైన టీడీపీ జెల్ల కొట్టింది. మొత్తం 25 డీసీలకు మంగళవారం ఎన్నికలు జరగగా మిత్రపక్షమైన జనసేనకు కేవలం మూడు డీసీలలో మాత్రమే అవకాశం కల్పించింది. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం పరిధిలో కూడా ఆ పార్టీకి కేవలం ఒక డీసీ మాత్రమే వచ్చింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని గోదావరి డెల్టాలో డీసీలకు ఎన్నికలు సజావుగా సాగాయి. అధికార టీడీపీ ఎమ్మెల్యేలు నిర్ణయించిన వారికే డీసీలుగా పదవులు దక్కాయి. వారు ఎంపిక చేసిన వారిని వాటర్ యూజర్ అసోసియేషన్ల (డబ్ల్యూయూఏ) ప్రతినిధులు ఎన్నుకున్నారు. పిఠాపురం నియోజకవర్గం పరిధిలో పీబీసీ ఒకటి నుంచి మురాలశెట్టి సునీల్‌కుమార్, రామచంద్రపురం నియోజకవర్గం పరిధిలో కాజులూరు డీసీ నుంచి లకాని కృష్ణ చైతన్య, రాజోలు నియోజకవర్గం నుంచి వినిశెట్టి బుజ్జి ఎంపికయ్యారు. పిఠాపురం పరిధిలో పీబీసీ–2 డీసీ నుంచి అనిశెట్టి సత్యానందరెడ్డి టీడీపీ నుంచి ఎంపికయ్యారు. ఇక జనసేన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే కరప డీసీకి పుణ్యమంతుల గంగా సత్యనారాయణ, కాకినాడ డీసీ నుంచి కొప్పిరెడ్డి వీరాస్వామి (టీడీపీ) ఎన్నిక కావడం గమనార్హం. పి.గన్నవరం డీసీగా గుబ్బల శ్రీనివాస్, అయినవిల్లి డీసీగా కాకర శ్రీరాములు ఎన్నిక కావడం జనసేన పార్టీకి మింగుడుపడని అంశంగా మారింది. కోనసీమ జిల్లాలో తూర్పు డెల్టా పరిధిలో ఆలమూరుకు మెర్ల గోపాలస్వామినాయుడు, కోటిపల్లికి దాట్ల విజయగోపాల్ రాజు, కూళ్ల మేకా శివప్రసాద్, రామచంద్రపురం నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, ఎరప్రోత వరం నిడదవోలు వెంకట సుబ్రహ్మణ్యచౌదరి, మండపేట వడాల వెంకట సుబ్బారెడ్డి ఎంపికయ్యారు. మధ్య డెల్టా పరిధిలో అల్లవరం దాట్ల వెంకట రాజగోపాలరాజు, అవిడి చపల జగన్నాథం, గోపాలపురం కరుటూరి నర్సింహరావు, కాట్రేనికోన ఆకాశం శ్రీనివాస్, అమలాపురం రాజులపూడి భీముడు, అయినవిల్లి కాకర శ్రీను, మురమళ్ల చివ లూరి సుబ్బరాజు, ఉప్పలగుప్తం దంగేటి వెంకట రెడ్డి నాయుడు ఎన్నిక కాగా, కాకినాడ జిల్లా తూర్పు డెల్టా పరిధిలో కాజులూరు లకాని కృష్ణ చైతన్య, సిరిపురం పేపకాయల నారాయణరావు, తాళ్లరేవు వేగేశ్న భాస్కరరాజు ఎన్నిక కాగా, తూర్పు గోదావరి జిల్లాలో తూర్పు డెల్టా పరిధిలో అనవర్తి తమలంపూడి సుధాకర్ రెడ్డి, కొమరిపాలెం కొవ్వూరి వేణుగోపాలరెడ్డి ఎన్నికయ్యారు.

నేటి నుంచి డిపార్టుమెంటల్ పరీక్షలు



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులకు బుధవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకూ ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించే డిపార్టుమెంటల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణపై రెవెన్యూ, పోలీస్, వైద్య, ఆరోగ్యం, విద్యుత్ తదితర శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ ఎస్.అచ్యుతాపురం రైల్వే ట్రాక్ వద్ద ఉన్న అయాన్ డిజిటల్, కాకినాడ రూరల్ రాయుడుపాలెం వద్ద ఉన్న సాఫ్ట్ టెక్నాలజీ సెంటర్లలో ఈ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులను ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకూ, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకూ పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకుని రావాలని జేసీ సూచించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి కె.సురేష్, కాకినాడ ఆర్‌డీఓ కార్యాలయం ఏఓ ఠాగూర్, కాకినాడ అర్బన్, రూరల్ తహసీల్దార్లు జితేంద్ర, ఎస్ఎల్ఎస్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల పదోన్నతుల జాబితా విడుదల

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల జాబితా విడుదలైంది. కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ మంగళవారం ఈ విషయం తెలిపారు. పదోన్నతుల వివరాలు జిల్లా విద్యా శాఖ వెబ్‌సైట్‌లో ఉన్నాయని, ఏమైనా అభ్యంతరాలుంటే బుధవారం ఉదయం 11 గంటల్లోగా తెలియజేయాలని సూచించారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లా సమన్వయాధికారి టి.ఉమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. బాలుర గురుకులంలో ఫిజికల్ సైన్స్–2 పోస్టులు, లెక్కలు, సోషల్ స్టడీస్ ఒక్కో పోస్టు భర్తీకి పురుషుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. అలాగే, బాలికల గురుకులాల్లో తెలుగు, ఫిజిక్స్, పీడీ ఒక్కో పోస్టు, ఫిజికల్ సైన్స్–2, పీఈటీ–2 పోస్టులు మహిళలతోనే గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన భర్తీ చేస్తామని వివరించారు. గతంలో గురుకులాల్లో పని చేసిన వారికి సంవత్సరానికి ఒకటి చొప్పున గరిష్ఠంగా 5 మార్కులు కలుపుతామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటాతో పాటు ధ్రువపత్రాల నకళ్లను 'జిల్లా కో ఆర్డినేటర్ ఆఫీస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ, కలెక్టరేట్ కాంపౌండ్, వికాస కార్యాలయం మేడ పైన, కాకినాడ' చిరునామాకు ఈ నెల 20వ తేదీలోగా అందజేయాలని కోరారు. సబ్జెక్టు టీచర్లు పోస్టుగ్రాడ్యుయేషన్‌లో ఫస్ట్ క్లాస్‌తో పాటు బీఎడ్, టెట్‌లో ఉత్తీర్ణులై ఉండాలని ఉమాదేవి స్పష్టం చేశారు.

అంగన్‌వాడీలపై ధరాభారం

- భారీగా పెరిగిన కూరగాయల ధరలు
- పాత చార్జీలతోనే మెనూ అమలు చేయాలంటున్న ప్రభుత్వం
- అప్పుల పాలవుతున్న కార్యకర్తలు
- నగదు పెంచాలని డిమాండ్



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు (పాత చిత్రం)

కాకినాడ సిటీ: నిత్యావసరాల ధరల భారంతో అంగన్‌వాడీ కార్యకర్తలు సతమతమవుతున్నారు. ధరలు పెరిగినా తాము చెప్పిన మెనూ ప్రకారమే చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం చెబుతూండటంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో తమకు చేతి చమురు వదిలిపోవడమే కాకుండా.. ఒక్కోసారి అప్పులు చేసి మరీ చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 21 మండలాల్లో 1,986 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటికి వస్తున్న చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందజేయాల్సి ఉంటుంది. దీనికిగాను అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం బియ్యం, నూనె, కందిపప్పు, గుడ్లు, పాలు అందజేస్తుంది. ఒక్కో చిన్నారికి రోజుకు 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల పప్పు, 5 గ్రాముల నూనె మాత్రమే ప్రభుత్వం కేటాయిస్తుంది. చిన్నారుల సంఖ్యకు అనుగుణంగా ఈ సరకులు పంపిణీ చేస్తారు. ప్రతి నెలా బియ్యం, కందిపప్పును అంగన్‌వాడీ కార్యకర్తలు రేషన్ దుకాణాల ద్వారా తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఈ సరకులను తరలించేందుకు, కేంద్రంలో జాగ్రత్తగా నిల్వ చేసేందుకు ప్రభుత్వం ఎటువంటి నగదూ చెల్లించదు. ప్రతి నెలా కూరగాయలకు రూ.800, గ్యాస్ సిలిండర్‌కు రూ.400 చొప్పున చెల్లిస్తుంది. వీటితోనే అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సి ఉంటుంది.

భారం పడుతోందిలా..

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొద్ది నెలలుగా కూరగాయల ధరలు భారీగా పెరిగిపోయాయి. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం చిన్నారులకు వండి, వడ్డించేందుకు అవసరమైన కూరగాయలు కొనుగోలు చేయడం అంగన్‌వాడీ కార్యకర్తలకు తలకు మించిన భారమే అవుతోంది. కూరగాయల కోసం ప్రభుత్వం ప్రతి నెలా ఇస్తున్న రూ.800 సరిపోవడం లేదని, ఫలితంగా అప్పులు చేసి మరీ చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.
- రెండు నెలలుగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు ఇవ్వడం లేదని చెబుతున్నారు. గత్యంతరం లేక కందిపప్పును కూడా అంగన్‌వాడీ కార్యకర్తలే బయట కొనుగోలు చేస్తున్నారు.
- కూరగాయలు, పప్పు, పులిహోర వంటి వాటిల్లో వేసే పోపు దినుసులను సైతం కొనుగోలు చేయాల్సి వస్తోంది. వీటికిగాను ప్రభుత్వం అదనంగా ఎటువంటి నగదూ ఇవ్వడం లేదు.
- వంట గ్యాస్ నిమిత్తం ప్రభుత్వం ప్రతి నెలా అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాల్సిన రూ.400 సైతం సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో పలు సందర్భాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు సొంత సొమ్ము వెచ్చించి గ్యాస్ తెచ్చుకోవాల్సి వస్తోంది. తప్పనిసరిగా మెనూ పాటించాలని చెప్పే ప్రభుత్వం.. పెరిగిన ధరలకు అనుగుణంగా తమకు అందించే మొత్తాన్ని కూడా పెంచాలని కోరుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ఉచితంగా వంట గ్యాస్ ఇస్తే ఉపయుక్తంగా ఉంటుందని అంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే మెనూ చార్జీలు పెంచాలని కోరుతున్నారు.
- చిన్నారులు, గర్భిణులు, బాలింతలు వచ్చే అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాల్సి ఉంటుంది. దీని కోసం సబ్బులు, చీపుర్లు, చాపలు తదితరాల కొనుగోలుకు ప్రభుత్వం నగదు అందజేయాలి. కానీ, ప్రభుత్వం దీనిని పట్టించుకోకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలకు చేతి చమురు వదిలిపోతోంది.
- కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నూనె, బియ్యం, కందిపప్పు వంటి సామగ్రి స్టాక్ లేకపోవడంతో పక్క కేంద్రాల నుంచి అరువు తెచ్చుకోవాల్సి వస్తోంది. గత్యంతరం లేక కొంత మంది బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది.

గర్భిణులకు ఇబ్బందులు

ఇదిలా ఉండగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రతి నెలా టేక్ హోం రేషన్ విధానంలో కందిపప్పు, బియ్యం, ఆయిల్‌తో పాటు కోడిగుడ్లు సరఫరా చేస్తుంది. కానీ రెండు నెలలుగా చాలా కేంద్రాలకు కందిపప్పు, నూనె సరఫరా కావడం లేదు. దీంతో వందలాది మంది గర్భిణులకు ఇబ్బందులు తప్పడం లేదు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

మొత్తం కేంద్రాలు	1,986
గర్భిణులు	10,868
బాలింతలు	10,410
0 – 6 నెలల చిన్నారులు	10,410
7 నెలలు – 3 సంవత్సరాల వారు	56,850
3 సంవత్సరాల నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులు	38,799

అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజువారీ మెనూ

సోమవారం	దోసకాయ పప్పు
మంగళవారం	పులిహోర, టమాటా పప్పు
బుధవారం	ఆకుకూర పప్పు
గురువారం	కూరగాయలతో సాంబారు
శుక్రవారం	కూరగాయల పప్పు
శనివారం	వెజిటబుల్ రైస్, ఆకుకూర, సాంబారు

ఉన్నతాధికారులకు నివేదించాం



పెరిగిన ధరలకు అనుగుణంగా కూరగాయలు, ఇతర అవసరాలకు తమకు అందిస్తున్న నగదు పెంచాలనే విషయాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు గతంలోనే మా దృష్టికి తీసుకుని వచ్చారు. దీనిపై ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదిక సమర్పించాం.

– కె.ప్రవీణ, ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి, కాకినాడ

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,500
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	10,000 – 11,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

చెట్టుపై నుంచి జారిపడి మృతి



బాపన్న (ఫైల్)

కొత్తపల్లి: మామిడిచెట్టు పై నుంచి జారిపడి మంగళవారం ఒక వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొండెవరం గ్రామానికి చెందిన బుర్ర బాపన్న(35) నవకంద్రవాడలో ఒక తోటలో మామిడి చెట్లకు మందు కొట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి పడి మృతి చెందాడు. బాపన్న పుట్టుకతో మూగ. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

తిరుపతి రూరల్: ఇష్టమైన అమ్మాయి ప్రేమించలేదనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం తిరుపతి రూరల్ మండలం అవిలాలలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ ఎస్కేమూర్తి తెలిపిన వివరాల మేరకు కాకినాడ జిల్లా శంఖవరం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన పి.రాజేష్(19) ఇంటర్ చదివి, ఆర్థిక ఇబ్బందుల కారణంగా తిరుపతికి వలస వచ్చాడు. తిరుమలలోని ఓ ప్రైవేటు హోటల్లో పనిచేస్తున్నాడు. 20 రోజుల క్రితం తిరుమల నుంచి వచ్చి అవిలాలలోని ఫ్రెండ్స్‌తో పాటు రూమ్‌లో ఉంటున్నాడు. తన ప్రేమను ఓ యువతి అంగీకరించడం లేదని పలుమార్లు ఫ్రెండ్స్ వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ నేపథ్యంలో మంగళవారం గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించారు.

పందెం పుంజా... మజాకా!



బరిలో దింపేందుకు బాదం మేత



ఇలా ఈత కొట్టిస్తారు



- రాజభోగాలతో పెంపకం
- జాతిని బట్టి పలుకుతున్న రేటు
- రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు ధర
- సంక్రాంతి బరిలో దింపేందుకు తర్ఫీదు

నిడదవోలు: సంక్రాంతి సందర్భంగా గోదావరి జిల్లాల్లో నిర్వహించే కోడి పందేలను తిలకించడానికి పలువురు ఆసక్తి చూపుతారు. రాజకీయ నేతలు, సినీ ప్రముఖులు సైతం పందేలకు సై అంటారు. పండగ సమీపిస్తుండడంతో కోడి పుంజుల వేటలో పందెం రాయుళ్లు ఉంటే మరోపక్క నిర్వాహకులు మూడు నెలల నుంచి పుంజుల పెంపకంలో నిమగ్నమయ్యారు. కోళ్ల పెంపకందార్లు, పందెంరాయుళ్లు మాత్రం పుంజులకు రాజభోగాలతో మేత పెట్టి మరీ పందేలకు సిద్ధం చేస్తున్నారు. పోలీసులు హెచ్చరిస్తున్నా ఏటా పందెంరాయుళ్లు బరితెగించి కోళ్లకు కత్తులు కట్టి బరుల్లో రక్తపు టేరులు పారిస్తున్నారు.

డిమాండ్‌ను బట్టి..

కత్తులు కట్టి బరిలో దింపే పుంజుల ధరలు వింటే ఆశ్చర్యం కలుగుతుంది. కోడిపుంజుల జాతులను పందెం రాయుళ్లు పలు రకాలుగా పిలుస్తారు. రకాన్ని బట్టి ఒక్కో పుంజు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు ధర పలుకుతోంది. సరైన పందెం పుంజు దొరికితే ఎంత రేటయినా ముట్టజెప్పడానికి పందెం రాయుళ్లు సిద్ధంగా ఉన్నారు. ప్రధానంగా సేతువు జాతి కోడి మీద పందేలు జోరుగా కాస్తారు. దీని ధర రూ.70 వేల వరకు పలుకుతోంది. వర్ల రకం కోడి ధర రూ. 50 వేలు ఉంది. నెమలి రకం కోడి పుంజు ప్రస్తుతం రూ.50 వేల నుంచి రూ.60 వేలు పలుకుతోంది. కాకి డేగ, పర్ల రూ.25 వేల నుంచి రూ.30 వేలు, ఎర్ర కెక్కిరాయి రూ.40 వేల ధర పలుకుతోంది. పచ్చకాకి డేగ రూ.30 వేల నుంచి రూ.40 వేలుకు అమ్ముతున్నారు. డిమాండ్‌ను బట్టి పుంజుల పెంపకందారులు రేటును అమాంతం పెంచుకుంటూ పోతున్నారు. రసంగి, సేతువా, కెక్కిరి, పూల, అబ్రస్, రసంగి, పండుడేగ, మైయిలా, సింగాలి, పెట్టమారు, అబ్రాసు, పింగళ వంటి రకాల కోడి పుంజులు రూ.25 వేల నుంచి రూ.30 వేల ధరకు పందెం రాయుళ్ల కొనుక్కుని పోతున్నారు.

పౌష్టికాహారంతోపాటు వ్యాయామం

ప్రతీరోజు వీటిని ఈత కొట్టించడంతో పాటు వేడి నీళ్లతో స్నానం చేయించి శక్తివంతమైన పుంజులుగా తీర్చిదిద్దుతారు. నవంబర్ మాసం నుంచి వీటికి గంట్లు, చోళ్లు, గుడ్లు, పిస్తాలు, బాదం, జీడిపప్పు, ఎండు ద్రాక్ష, కిస్మిస్, నల్ల నువ్వులు, తాటి బెల్లం, మటన్ కైమా, నాస్తా వంటివి ఆహారంగా ఇస్తారు. పౌష్టికాహారం తీసుకున్న పుంజులకు అరుగుదలకు, బద్దకం, నీరసం రాకుండా ప్రతీ రోజూ వ్యాయామాలు కూడా చేయిస్తున్నారు. కొందరు అదనంగా విటమిన్ ట్యాబ్‌లెట్స్ వేసి పెంచుతున్నారు. ప్రత్యేక ఆహారంతో పెంచుతూ సంక్రాంతి బరిలోకి సిద్ధం చేస్తున్నారు.

ముహూర్తాలు చూసి మరీ..

సేతువా, పచ్చకాకి, డేగ, కాకి పుంజు, పెట్టమారు వంటి జాతి పుంజులు బరిలో దిగితే నువ్వా..నేనా అనేలా తలపడతాయి. సేతువు రకం తెల్ల కోడి పుంజు బరిలో ప్రత్యర్థి పుంజును మట్టి కరిపించేందుకు గాయాలతో రక్తం కారుతున్నా లెక్క చేయకుండా కొన ఊపిరి ఉన్నంత వరకు పోరాడుతుంది. డేగ మీద కూడా ఎక్కువగా పందేలు కడతారు. ఇది కూడా బరిలో పందెం రాయుళ్లకు కాసుల వర్షం కురిపిస్తుంది. కొందరు కోడి పుంజుల జాతి పేర్ల ప్రకారం ముహూర్తాలు చూసుకుని మరీ పందేలు కాస్తారు. కోడి జాతిని బట్టి ఏ దిక్కుకు వెళ్లాలి, ఏ సమయంలో పుంజులను బరిలో దింపాలో ముందుగానే ముహూర్తాలు చూసుకుంటారు.

29 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్



రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసిన ఎస్సై శివకృష్ణ

పి.గన్నవరం: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని సోమవారం అర్ధరాత్రి పి.గన్నవరంలో ఎస్సై బి.శివకృష్ణ పట్టుకున్నారు. అందులో ఉన్న 29 కింటాళ్ల బియ్యంతో పాటు, వాహనాన్ని సీజ్ చేశారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజోలు మండలం తాటిపాక గ్రామం నుంచి బియ్యం బస్తాలతో రావులపాలెం వైపు వెళ్తున్న వాహనాన్ని స్థానిక గంటి రోడ్డులో పట్టుకున్నారు. అందులో పీడీఎఫ్ బియ్యం ఉన్నట్టు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. సీజ్ చేసిన బియ్యం విలువ రూ.1,16,000 ఉంటుందని ఎస్సై తెలిపారు. ఆ బియ్యాన్ని ఎంఎస్‌ఓ ఎండీ నాగ పూర్ణిమకు అప్పగించారు. అనకాపల్లికి చెందిన వాహన యజమాని ఎస్.కొండబాబు, మగటపల్లికి చెందిన కేకేఎస్ మణికంఠలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న పోలీసు పహారా



సామర్లకోట మండలం వేట్లపాలెంలో ఎస్సై మూర్తి ఆధ్వర్యంలో పోలీసు పహారా

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం, మంగాయ్యమ్మ కాలనీలో పోలీసు పికెట్ కొనసాగుతోంది. గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదం చినికి చినికి గాలివానగా మారి ముగ్గురు హత్యకు దారి తీసిన విషయం విదితమే. వేట్లపాలెం మంగాయ్యమ్మ కాలనీలో కార్దాల కుటుంబ సభ్యులు ఇంటిని నిర్మించుకోవడాన్ని అదే ప్రాంతానికి చెందిన బత్సల కుటుంబ సభ్యులు వ్యతిరేకించారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఇంటి శ్లాబ్ పనులు జరుగుతున్న సమయంలో బత్సల వర్గీయులు కత్తులతో కర్ధాల కుటుంబ సభ్యులపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఘటనా ప్రదేశంలో ఒకరు, ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలో ఇద్దరు మృతి చెందారు. దాంతో గ్రామంలో హింసాత్మక ఘటనలు జరిగే అవకాశం ఉన్నదని భావించి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ డి శ్రీహరిరాజు ఆధ్వర్యంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి పోస్టుమార్టమ్ అనంతరం గ్రామానికి వచ్చిన మృతదేహాలకు పోలీసు బందోబస్తు మధ్య అంత్యక్రియలు నిర్వహించిన విషయం తెలిసిందే. గ్రామంలో మంగళవారం కూడా పోలీసులు పహరా కాశారు. హత్య చేసిన వారి కోసం గ్రామంలో ఎస్సై మూర్తి ఆధ్వర్యంలో సమాచారం సేకరిస్తున్నారు. అనుమానం ఉన్న వారిని అదుపులోకి తీసుకొంటున్నారు.

పోలీసుల అదుపులో 20 మంది?

మాల చెరువు వద్ద ఆదివారం జరిగిన ముగ్గురు హత్యకు సంబంధించి 20 మంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. ఘటనా ప్రదేశంలో దాడి చేయడానికి వచ్చిన వారి సెల్ ఫోన్ నంబర్ల ఆధారంగా అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. హత్య కేసులో గ్రామానికి చెందినవారే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందినవారు కూడా ఉన్నట్లు సమాచారం. దీనిపై సీఐ ఎ.కృష్ణభగవాన్ మాట్లాడుతూ కేసు దర్యాప్తులో ఉందని త్వరలో నిందితులను అరెస్టు చేస్తామని చెప్పారు.

దోపిడీ దొంగల బీభత్సం

- ఇంటి తాళం పగులగొట్టి.. యజమానులను తాళ్లతో బంధించి..
- 24 గ్రాముల బంగారం, రూ.30వేల నగదు అపహరణ



ఇంటి యజమాని కృష్ణమూర్తిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నల్లజర్ల: దూబచర్లలో మంగళవారం తెల్లవారుజామున దోపిడీ దొంగలు ఒక ఇంట్లోకి చొరబడి 24 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు దోచుకుపోయారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. దూబచర్లకు చెందిన రిటైర్డ్ వ్యవసాయాధికారి శీమకుర్తి కృష్ణమూర్తి తన భార్య లక్ష్మీకుమారితో బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్కన నివాసం ఉంటున్నారు. తన భార్య అనారోగ్యం కారణంగా సహాయకురాలిగా అదే గ్రామానికి చెందిన జుత్తిగ పెందిట్లును నియమించుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున అందరూ గాఢనిద్రలో ఉండగా ఇంటి తలుపుల తాళం పగులగొట్టి నలుగురు వ్యక్తులు మంకీ క్యాపులు, చేతులకు గ్లౌజులు ధరించి లోనికి ప్రవేశించారు. ఈ విషయం గమనించి సహాయకురాలు ఎవరని ప్రశ్నించేలోగా ఆమె చేతులను చీరతో కట్టి కదిలితే చంపేస్తామని బెదిరించారు. ఇంటి యజమాని కృష్ణమూర్తి కాళ్లు, చేతులు చీరలతో కట్టేశారు. అనారోగ్యంతో మంచంపై ఉన్న లక్ష్మీకుమారి మెడలో ఉన్న బంగారు గొలుసు, బీరువా తెరచి అందులో ఉన్న మరికొన్ని ఆభరణాలు, రూ.30వేల నగదును దోచుకెళ్లారు. కొద్దిసేపటి తర్వాత తేరుకున్న ఇంటి యజమాని డయల్ 112కు కాల్ చేసి జరిగిన విషయం చెప్పారు. ఘటనా స్థలాన్ని అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీ దేవకుమార్, నల్లజర్ల, దేవరపల్లి సీఐలు శ్రీనివాస్, నాయక్, ఎస్ఐలు సోమరాజు, రమేష్, బాలాజీ చేరుకొని విచారణ చేపట్టారు. ఇంట్లో పలుచోట్ల క్లూస్ టీం వేలిముద్రలు సేకరించగా డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు.

ప్రియుడి ఇంటి ముందు యువతి నిరసన

పెళ్లి చేసుకుని మోసం చేశాడని, న్యాయం చేయాలని డిమాండ్




ప్రియుడి ఇంటి ముందు నిరసన దీక్ష చేస్తున్న ఝాన్సీ, కుటుంబ సభ్యులు

రావులపాలెం: ప్రేమించి పెళ్లి చేసుకున్న తరువాత ప్రియుడు మోసం చేశాడని, ఇంటికి వెళితే అత్తమామలు తాళి తెంపి బయటకు నెట్టి వేశారని, తనకు న్యాయం చేయాలని రావులపాలెం మండలం కొమరాజులంకకు చెందిన యామన ఝాన్సీ, కుటుంబ సభ్యులతో కలసి ప్రియుడి ఇంటి ముందు మంగళవారం నిరసన దీక్ష చేపట్టింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం కొమరాజులంకకు చెందిన గంద్రోతు హరికృష్ణ, ఝాన్సీ ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుని ఇంటికి వెళ్లగా హరికృష్ణ తల్లిదండ్రులు సత్తిపండు, వెంకటలక్ష్మి తాళి తెంపి బయటకు నెట్టి వేసి దుర్భాషలాడి ఆమెపై దాడి చేశారు. మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించగా కుటుంబ సభ్యులు ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. కాపురానికి తీసుకుని వెళ్లాలని ఎన్నిసార్లు చెప్పినా తీసుకుని వెళ్లడం లేదని, ఝాన్సీ, కుటుంబ సభ్యులు, కుల పెద్దలు హరికృష్ణ ఇంటి వద్ద నిరసన దీక్ష చేపట్టారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వీరికి మద్దతుగా రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ అధ్యక్షుడు మట్టా వీరబాబు, జై గౌడ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నంగేటి రంగారావు మాట్లాడుతూ ప్రేమించి పెళ్లి చేసుకుని మోసం చేయడం దారుమన్నారు. న్యాయం జరగకపోతే ఉద్యమం చేస్తామన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై చంటి సిబ్బందితో అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.

రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభ

3 బంగారు పతకాలు సాధించిన నాగబాబు



మూడు బంగారు పతకాలు, సర్టిఫికెట్ చూపిస్తున్న నాగబాబు

కరప: కృష్ణాజిల్లా గుడివాడలో జరిగిన 44వ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్–2024 పోటీలలో కరప సబ్ యూనిట్ మలేరియా అధికారి యాతం నాగబాబు ప్రతిభ చూపి మూడు బంగారు పతకాలు సాధించాడు. గుడివాడలోని ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియం క్రీడామైదానంలో ఈ నెల 14, 15 తేదీల్లో పరుగు పందేలు జరిగాయి. కరప పీహెచ్‌సీలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. 200, 400, 800 మీటర్ల పరుగు పందేలలో పాల్గొని మూడింటిలో కూడా ప్రథమస్థానంలో నిలిచి మూడు బంగారు పతకాలు సాధించానన్నాడు. 2025 ఫిబ్రవరి నెల 6 నుంచి 8వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని ఆళ్వార్‌లో జరిగే 44వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్టు నాగబాబు తెలిపారు. కాకినాడ జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ కార్యాలయంలో మలేరియా విభాగంలో సబ్‌యూనిట్ అధికారిగా, కరప సబ్‌యూనిట్ మలేరియా అధికారిగా కూడా పనిచేస్తున్న నాగబాబు 2013 సంవత్సరం నుంచి ఇప్పటివరకు రాష్ట్ర, జాతీయ, జిల్లా స్థాయిలో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ పరుగు పందేలలో ఓపెన్ మీట్‌లో 100, 200, 400, 800, 1,500 మీటర్ల , రిలే పరుగు పందెంలో పాల్గొని ఇప్పటివరకు 60 పతకాలు సాధించానన్నారు. ఇందులో 15 బంగారు, 19 వెండి, 26 కాంస్య పతకాలు ఉన్నాయని తెలిపారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు





స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ, వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మంగళవారం బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ ఏజీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రీజనల్ మీట్ 2024–25ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాలచర్ల, దివాన్‌చెరువు మధ్యలో రాష్ట్ర స్థాయి స్టేడియాన్ని నిర్మిస్తామన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు, ఎటపాక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, హెడ్ ఆఫ్ ది జనరల్ సెక్షన్ ఎస్.మురళీకృష్ణ, తూర్పుగోదావరి జిల్లా పీడీ, పీఈటీల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీడీ ప్రసాద్, ఎస్.నాగరాజు, కోశాధికారి ఎస్.వీరబాబు మాట్లాడారు. ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ ఎస్సై క్రాంతికుమార్, పాలిటెక్నిక్ కళాశాల సూపరింటెండెంట్ మహేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు

మంగళవారం జరిగిన వాలీబాల్, కబడ్డీ, బాల్ బాడ్మింటన్, చెస్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. రాజమహేంద్రవరం ఆర్‌ఎంసీ ఇండోర్ స్టేడియంలో షటిల్, టౌన్‌హాల్ దగ్గర గౌతమీ టేబుల్ టెన్నిస్ అకాడమీలో టేబుల్ టెన్నిస్ పోటీలు జరిగాయి.

విజేతలు వీరే...

బొమ్మూరులో పాలిటెక్నిక్ కళాశాలలో మొదటిరోజు పోటీల్లో విజేతల వివరాలను ఇన్‌చార్జి పీడీ కె.నరసింహరావు తెలిపారు. చెస్‌లో డీఎస్ఎస్‌వి సాత్విక్(బీవీసీ, భట్లపాలెం) విన్నర్‌గాను, డి.గిరిమణిశేఖర్(జీఎంఆర్, బొమ్మూరు), బాడ్మింటన్ సింగిల్స్‌లో ఎన్.యశ్వంత్(గైట్,రాజానగరం) విన్నర్‌గాను, సీహెచ్ గౌతమ్ (చైతన్యకాలేజీ) రన్నర్, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో సీహెచ్.గౌతమ్, సీహెచ్.వినోద్(చైతన్యకాలేజీ)విన్నర్స్‌గాను, ఎన్.యశ్వంత్, పి.వీరేంద్ర(గైట్ కాలేజీ) రన్నర్స్‌గా నిలిచారు. టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ఎంవైజీఎం పట్టాభిరామ్ (ఆంధ్రా పాలిటెక్నిక్, కాకినాడ) విన్నర్‌గాను, వి.రాహుల్(పైడా కాలేజీ) రన్నర్, డబుల్స్‌లో ఎస్.వేణు, జి.శ్రీసాయినాథుడు(గైట్) విన్నర్స్‌గాను, కె.మహేష్, ఎంవైఎస్ఎం పట్టాభిరామ్(ఆంధ్రాపాలిటెక్నిక్) రన్నర్స్, బాల్ బాడ్మింటన్‌లో వైవీఎస్‌బీఆర్ఎం(ముక్తేశ్వరం) విన్నర్‌గాను, జీఎంఆర్(రాజమహేంద్రవరం)రన్నర్‌గా నిలిచారు.

మామపై కత్తితో అల్లుడి దాడి

అయినవిల్లి: భార్యను కొడుతుండగా అడ్డు వచ్చిన మామపై అల్లుడు కత్తితో దాడి చేసిన ఘటన అయినవిల్లి మండలం శానపల్లిలంకలో చోటు చేసుకుంది. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ ఆర్.శ్రీను తెలిపారు. శానపల్లిలంక తూర్పుపేటకు చెందిన ముమ్మిడివరపు కృష్ణమూర్తికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య ఇటీవల మృతి చెందింది. కుమార్తెకు 15 సంవత్సరాల క్రితం అమలాపురం ఈదరపల్లికి చెందిన కల్లు ఏసుతో వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. అల్లుడు మద్యానికి బానిసై కుమార్తెను తరచూ కొడుతున్నాడు. అయితే ఇటీవల అల్లుడికి రోడ్డు ప్రమాదం జరిగింది. అప్పటి నుంచి కుమార్తె, అల్లుడు కృష్ణమూర్తి వద్దే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15న తన కుమార్తెను కొడుతుండగా అడ్డు వచ్చిన మామపై కత్తితో దాడి చేశాడు. దీంతో కృష్ణమూర్తి కుడి చేతికి గాయమైంది. అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మామ కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

హత్యకేసులో ఏడేళ్ల జైలు

కడియం: మండలంలోని వేమగిరి గ్రామంలో 2002లో నమోదైన హత్య కేసుకు సంబంధించి పితాని సత్తిబాబు అలియాస్ సత్యనారాయణ అలియాస్ అన్నమయ్యకు ఏడేళ్ల జైలుశిక్ష, రూ.15వేల జరిమానా విధించారని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఏ.వెంకటేశ్వరరావు తెలిపారు. తన భార్య భవానీ వేమగిరి తోటకు చెందిన బొంతు వెంకన్నతో కలిసి ఉండడాన్ని చూసిన సత్తిబాబు రగిలిపోయాడు. కత్తితో వారిపై దాడి చేశాడు. వెంకన్న అక్కడికక్కడే మృతి చెందగా భవానీ గాయాలతో బయటపడింది. వెంకన్న సోదరుడు ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు అప్పటి ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్‌కుమార్ కేసు దర్యాప్తు చేశారు. 10 మంది సాక్షులను విచారించాక రాజమహేంద్రవరం ఫ్యామిలీ కోర్టు, 9వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ఎం.మాధురి శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున వీవీఎస్‌బీ రాజు వాదనలు విన్పించారు. అప్పటి హెచ్‌సీ కె.శ్రీనివాస్, ప్రస్తుత కోర్టు కానిస్టేబుల్ కె.శ్రీనివాస్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.